క్లుప్తంగా

రేపు ఉపాధిహామీ ప్రజా వేదిక

మల్హర్: రేపు(మంగళవారం) ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఉపాధిహామీ ఏపీఓ హరీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ ఆధ్వర్యంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై మండలంలోని తాడిచర్ల ఎంపీడీ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టిప్పర్ బోల్తా



కాటారం: కాటారం మండలం మేడిపల్లి అటవీప్రాంతంలో ఆదివారం టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడింది. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి తాడిచెర్ల వైపు టిప్పర్ బొగ్గు లోడ్ కోసం వెళ్తుంది. ఇదే క్రమంలో టిప్పర్ స్టీరింగ్ ఫెయిల్ అవడంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. డ్రైవర్ అప్రమత్తమై పక్కకు దూకడంతో ప్రమాదం తప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ధనుర్మాస వ్రత మహోత్సవ పూజలు



మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజలు జిల్లా కేంద్రంలోని దేవాలయాల్లో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గోదాదేవి (ఆండాళ్) అమ్మవారికి, శ్రీరంగనాథ స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించగా మహిళలు మంగళహారతులతో అమ్మవారు, స్వామివారికి స్వాగతం పలికారు. శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి దేవాలయంలో ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో స్వామివారు, అమ్మవారలకు అభిషేకాలు, అలంకరణ పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామివారు విచ్చేసి ధనుర్మాస వ్రత విశిష్టత, భవత్ సంకల్పుడైన శ్రీమన్నారాయణుడి గురించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఓం నారాయణ లోయ, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, మొగిలి మధుకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బెంగళూరుకు చెందిన తిరుప్పావై ప్రవచకులు శ్రీమాన్ కోయిల్ కన్నాడై వెంకట రామానుజచార్యులు పాల్గొన్నారు.

'ఆత్మహత్యలతో కుటుంబ సభ్యులకు క్షోభ'

గూడూరు: మనిషి జన్మ జీవించడానికే తప్ప, కష్టాలు ఎదురైనప్పుడు ఆత్మహత్యకు పాల్పడడానికి కాదని, జీవితం జీవించడానికేనని ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంటరి జీవితంలోకి వెళ్లిన వారు తనకు ఎవరూ లేరని ఆత్మహత్యలకు పాల్పతున్నారన్నారు. వారి కుటుంబ సభ్యుల మనోవేదన అర్థం చేసుకునే వారెవరని, వారి మరణంతో కుటుంబ సభ్యులు క్షోభకు గురవుతారని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలిపాడు.

ధ్యానం.. సంపూర్ణ ఆరోగ్యం



సెంటర్‌లో ధ్యానం చేస్తున్న సాధకులు



కేక్ కట్‌చేసి ఆవిర్భావ వేడుకలు జరుపుకుంటున్న సాధకులు

- ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి మార్గం ధ్యానం

భూపాలపల్లి రూరల్: ఆధునిక యుగంలో మానవుడు ఉన్నత శిఖరాలకు ఎదిగానని అనుకుంటూ నైతికంగా ఎంతో దీనస్థితిలో ఉన్నాడు. తనను తాను తెలుసుకోవడం అనే మహోన్నత ఆశయం ప్రతి మానవునికి అవసరమని. అందుకు ధ్యాన సాధన తప్పనిసరి. అని సాధకులు తెలుపుతున్నారు. ధ్యానం కోసం అడవులకు, పర్వతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. సంసారంలోనే ఉంటూ ధ్యానమార్గంతో ఏకాగ్రతను సాధించవచ్చని, ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలను ధ్యాన సాధకులు చెరుకుపల్లి రవీందర్ తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని జీఎం కార్యాలయం ఎదుట శ్రీరామ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హార్ట్‌ఫుల్నెస్ ధ్యాన కేంద్రంలో ఉచితంగా ధ్యానంలో శిక్షణ ఇస్తున్నారు. అవకాశాన్ని భూపాలపల్లి పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

17 వసంతాల వేడుక

శ్రీరామ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో 17 డిసెంబర్ 2006లో భూపాలపల్లి పట్టణంలోని జీఎం కార్యాలయం ఎదుట హార్ట్‌ఫుల్నెస్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఆదివారం నాటికి 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సాధకులు ధ్యానకేంద్రంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేశారు. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.

ధ్యానం చేసే పద్ధతులు

హాయిగా.. సుఖాసనంలో కూర్చొని చేతులు రెండు కలిపి, కాళ్లు రెండు క్రాస్ చేసుకొని, కళ్లు మూసుకొని ప్రకృతి సహజంగా జరుగుతున్న విశ్వం నుంచి వస్తున్న కాంతిని గమనిస్తూ ఉండాలి. మధ్యలో అనేక ఆలోచనలు వస్తున్నా కాంతి మీదకే ధ్యాస మరల్చుతూ ఉంటే క్రమంగా ఆలోచన రహిత స్థితి కలుగుతుంది. ధ్యానం చేయడం వలన అధిక విశ్వశక్తిని పొందవచ్చని, అనారోగ్యం దూరం అవుతుందని, విద్యార్థులకు అలసట లేకుండా ఏకాగ్రత పెరుగుతుందని సాధకులు వివరిస్తున్నారు.

ధ్యానంతో లాభాలు..

- సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత కలుగుతాయి
- ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి.
- కష్టాలను ఎదుర్కొనే మనోధైర్యం పెరుగుతుంది.
- ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి ఏకైక మార్గం ధ్యానమే..

ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుంది..



ధ్యానం శరీరాన్ని రిలాక్స్ చేయడంతో పాటు, ఆలోచనలను క్రమబద్ధం చేస్తుంది. హార్ట్‌ఫుల్నెస్ సంస్థను స్థాపించి 17 సంవత్సరాలు అవుతోంది. వేలమందికి ధ్యానాన్ని పరిచయం చేశాం. ధ్యానాన్ని సాధన చేయాలనుకునేవారు. హార్ట్‌ఫుల్నెస్ సెంటర్‌లో సంప్రదించాలి.

– చెరుకుపల్లి రవీందర్, హార్ట్‌ఫుల్నెస్ జిల్లా కోఆర్డినేటర్

విద్యార్థులకు, మహిళలకు ధ్యానం అవసరం



మహిళలు ధ్యానంపై దృష్టి సారిస్తే కుటుంబమే ఆరోగ్య కుటుంబమవతుంది. ప్రెగ్నెన్సీ సమయంలో మహిళలు ఆందోళన చెందకుండా వారికి ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ధ్యాన కేంద్రం సేవలు వినియోగించుకోవాలి.

– సీ.హెచ్ మాధవి, హార్ట్‌ఫుల్నెస్ సెంటర్ కోఆర్డినేటర్

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ సంతోష్

మహాముత్తారం: కేంద్రప్రభుత్వం అందించే బ్యాంక్ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని మహాముత్తారం తెలంగాణ బ్యాంక్ మేనేజర్ సంతోష్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ఆదివారం మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లి, నిమ్మగూడెం గ్రామపంచాయతీల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు పథకాలను ప్రతీ ఒక్కరికి చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉపాధి కల్పన కోసం అనేక రకాలైన రుణాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, హటల్ పెన్షన్ యోజన, పీఎం కిసాన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ముద్ర యోజన పథకాల గురించి వివరించారు. ఈ పథకాలను ప్రజలు వినియోగించుకుని లబ్ధిపొందాలని తెలిపారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, సర్పంచ్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ఇంతియాజ్, ఏఈఓ పుష్పలత, బాలకృష్ణ, రాజేష్, తదితరులు ఉన్నారు.

కల్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలోని నాపాక శ్రీలక్ష్మీనరసింహా స్వామి కల్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నావిష్కరించారు. ఈ నెల 22 నుంచి 24 వరకు నాపాక సర్వతోభద్ర దేవస్థానం నందు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ యాదండ్ల రాజయ్య, ప్రధాన అర్చకులు పెండ్యాల ప్రభాకరాచార్యులు తెలిపారు. ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, అప్పం కిషన్, కొక్కుల సదానందం, మాజీ జడ్పీటీసీ కాట్రెవుల సాయిలు, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నక్క భాస్కర్, తోట్ల రాజయ్య, కంచర్ల రాములు, ఐలయ్య, రాములు, శివకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజన్న స్వామి పడిపూజ



పడిపూజ కార్యక్రమానికి హాజరైన స్వాములు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామ సమీపంలోని గుడి గుట్టల వద్ద శనివారం రాత్రి అంజన్న స్వాముల పడి పూజ కార్యక్రమం గురుస్వామి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటాపురం, వాజేడు, చర్ల మండలాలకు చెందిన అంజన్న స్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పడి పూజ కార్యక్రమం రాత్రి 8 గంటలకు ప్రారంభమై 11 గంటల వరకు సాగింది. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు, స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం అంజన్న స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కే పురం గ్రామంలో ఆదివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. 20మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ మాట్లాడుతూ.. రక్త హీనతతో బాధపడుతున్న పిల్లల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదాతలకు వెంకటాపురం ఎస్సై అశోక్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌కే పురం సర్పంచ్ పూనెం శ్రీదేవి, బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి డర్రా దామోదర్, రాంప్రసాద్, నాగేశ్వరావు, దినేశ్, సతీశ్, నరేందర్, మధు తదితరులు ఉన్నారు.

రోజు కూలి రూ.600 చెల్లించాలి

నెహ్రూసెంటర్: ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కూలీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను ఏడాదికి 200 రోజులు పనులను కల్పించాలని, ప్రతిరోజు రూ.600 కూలి చెల్లించాలని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్, బాణాల రాజన్న, ఎండి.యాకుబ్, చేపూరి గణేష్ పాల్గొన్నారు.

రెండు గంటల నిరీక్షణ



ఏటూరునాగారం బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



బస్సు లేక ప్రైవేటు వాహనాల్లో తరలిపోతున్న ప్రయాణికులు

- మహాలక్ష్మి పథకం వల్ల బస్సులు కరువు
- ప్రైవేట్ వాహనాల్లో తరలిన ప్రయాణికులు
- ఏ బస్సు చూసిన మహిళలే అధికం

ఏటూరునాగారం: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణం అధికమైంది. ఆర్టీసీ బస్సుల్లో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు సకాలంలో లేకపోవడంతో ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఎదురు చూశారు. హనుమకొండకు సరైన బస్సులు లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. గంటల తరబడి వేచి చూసిన తర్వాత బస్సులు రాకపోవడంతో మ్యాజిక్‌లు, ప్రైవేటు వాహనల్లో తరలివెళ్లారు. ఉచిత ప్రయాణం కావడంతో అనేక మంది మహిళలు వివిధ పనులపై వరంగల్, హనుమకొండ ఇతర ప్రాంతాలకు తరలిపోవడం జరుగుతుంది. అంతే కాకుండా ఏ బస్సు వచ్చిన మహిళలే అధికంగా ఉండడం గమనార్హం. బస్సు ఎక్కే క్రమంలో కూడా రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. బస్సు సర్వీసులు మరింత పెంచి ఏ ప్రయాణికులకు కూడా ఇబ్బంది లేకుండా చూడాలని మహిళలు సైతం ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

ఆర్టీసీ సర్వీసులు పెంచాలి



బస్సుల కోసం బస్టాండ్ వద్ద వేచి చూడాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సుల సర్వీసులను పెంచాలి. కేవలం మహిళలు అధికంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వల్ల రద్దీ పెరిగింది. పురుషులు అత్యవసర పరిస్థితుల్లో బస్సుల్లో వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇబ్బందులు లేకుండా చూడాలి.

-ఇర్సవడ్ల సంతోష్, ఏటూరునాగారం

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన ప్రకాశ్

కాటారం: కాటారం మండలం రేగుల గూడెం బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్హర్ మండలం కొయ్యూర్‌కు చెందిన యువకుడు లావుడ్య ప్రకాశ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశ్ పనుల నిమిత్తం బైక్‌పై కొయ్యూర్ నుంచి కాటారం వైపుగా వస్తున్నాడు. ఈ క్రమంలో లారీ వెనకనుంచి వచ్చి బలంగా ఢీ కొట్టింది. దీంతో ప్రకాశ్ రోడ్డుపై ఎగిరిపడటంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ప్రమాదానికి గల వివరాలను నమోదు చేసుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్



బయ్యక్క చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్య

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో అమనగంటి సుభద్ర, కలికోట రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ కసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పర్లపెల్లి ఓదేలు, బొమ్మ శంకర్, వలబోతుల నరేష్, ఈసంపెల్లి రాములు తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్: మండలంలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన చాప బయ్యక్క, పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన పల్లె శ్రీధర్ తల్లి మృతి చెందగా వారి కుటుంబాలను మంత్రి సీతక్క తనయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య పరామర్శించారు. ఈ మేరకు ఆదివారం మృతుల చిత్ర పటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట యూత్ నాయకులు దేవరనేని నేపాల్ రావు, సుమన్, మధు, ఇసార్‌ఖాన్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత

జిల్లాకేంద్రానికి చెందిన అరిగెల రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, సర్వర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు తస్లీమా మహ్మద్ ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం ట్రస్టు ఆధ్వర్యంలో అందించారు.

మేడారం జాతరలో పోలీసుల సేవలు కీలకం



కమాండ్ కంట్రోలర్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరలో పోలీసుల సేవలు చాలా కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మేడారంలో మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ హైదారాబాద్ (సీఎస్ఆర్) ఫండ్ ఆధ్వర్యంలో నిర్మించిన పోలీసుల కమాండ్, కంట్రోలర్ భవన నిర్మాణాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్ ఆలంతో కలిసి మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. జాతరలో పోలీసు ఉన్నతాధికారులు భక్తులకు సేవలందించడంతోపాటు జాతరలో భక్తుల పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ భవనం చాలా ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క అన్నారు. ప్రారంభోత్సవంలో అడిషనల్ ఏఆర్ ఎస్పీ సదానందం, ఏటూరుగానం ఏఎస్పీ సంకీర్త్, డీఎస్పీ రవీందర్, ఓఎస్డీ అశోక్‌కుమార్, పస్రా సీఐ శంకర్, ఎస్సై ఓంకార్‌యాదవ్, పోలీసులు పాల్గొన్నారు.

సమ్మక్క– సారలమ్మలకు దర్శించుకున్న సీతక్క

సమ్మక్క– సారలమ్మలను రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం దర్శించుకున్నారు. మంత్రిగా పదవి బాధ్యతలను స్వీకరించిన ఆమె తొలిసారి అమ్మవార్లను దర్శించుకున్నారు. సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎత్తు బంగారం సమర్పించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. ఆలయ సంప్రదాయంగా మేడారం ఈఓ రాజేంద్ర, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు డోలి వాయిద్యాలతో గద్దెల వద్దకు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రి సీతక్కకు పూజారులు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రసాదం అందజేశారు. ఎస్పీ గాష్ ఆలం పర్యవేక్షణలో డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పస్రా సీఐ శంకర్, ఎస్సైలు ఓంకార్‌యాదవ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మంత్రి ఘన స్వాగతం

మేడారానికి వచ్చిన మంత్రికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ గాష్ ఆలం, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఓఎస్డీ అశోక్‌కుమార్ బొకెలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆదివారం మేడారానికి వచ్చిన భక్తులతోపాటు నాయకులు, కార్యకర్తలు సీతక్కకు జేజేలు పలికారు. ప్రజలు పలు సమస్యలపై సీతక్కను కలిసి వినతి పత్రాలను అందజేశారు. భక్తుల మొక్కుల సందడితోపాటు మంత్రి సీతక్క పూజలతో మేడారం గద్దెల ప్రాంగణం ఆదివారం కోలాహలంగా మారింది.



తులాభారంలో మంత్రి సీతక్క

ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం..



మాట్లాడుతున్న దేవిరెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ఉదయం నడక ఆరోగ్యానికి మంచిదని, ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలని అప్పుడే ఆరోగ్యవంతం ఉంటారని ప్రముఖ వైద్యులు సీహెచ్. దేవిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సీహెచ్.దేవిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆరోగ్యవతంమైన సమాజం కోసం వాకర్స్ సభ్యులు పాటుపడాలని, హెల్త్ క్యాంప్ నిర్వహనకు తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల సాంబయ్య, కోశాధికారి తండా సందానందం, గౌరవ అధ్యక్షుడు భువనగిరి రవీందర్ గుప్తా, సభ్యులు సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్, కృష్ణమూర్తి, దాసరి ప్రసాద్, శ్రీనివాస్, ఉపేంద్రం, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.